# సాక్షి తిరుపతి

ఆదివారం । 30 । మార్చి । 2025





**ఎందుకు రమ్మన్నారు..**
వెంకటగిరి ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మహిళా ఎంపీటీసీకి ఘోర అవమానం చోటుచేసుకుంది.
- IIలో



**ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయండి**
విద్యార్థినులు మహిళా సాధికారిత వైపు అడుగులు వేయాలని శ్రీపద్మావతి మహిళా కళాశాల ప్రిన్సిపల్ పిలుపునిచ్చారు.
- IIలో

**రంజాన్ వేళలు**

| | ఇఫ్తార్ ఆదివారం (సా) | సహర్ సోమవారం (ఉ) |
|---|---|---|
| తిరుపతి | 6-27 | 4-50 |
| గూడూరు | 6-22 | 4-47 |

## న్యూస్‌రీల్

### ఉపాధి నిధులతో సీసీ రోడ్లు



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి అర్బన్:** ఉపాధిహామీ పథకం ద్వారా పెద్ద ఎత్తున కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు సీసీ రోడ్లు సైతం నిర్మించినట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన శనివారం డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, పంచాయతీరాజ్ జిల్లా అధికారి రామ్మోహన్‌తో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1.72 లక్షల మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించామన్నారు. అలాగే 209.75 కిలోమీటర్ల సీసీ రోడ్లకు రూ.100 కోట్లు ఖర్చు చేసినట్టు పేర్కొన్నారు.

### రేపు గ్రీవెన్స్ రద్దు

**తిరుపతి అర్బన్:** సోమవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

**రేపు పోలీసు గ్రీవెన్స్ రద్దు**

**తిరుపతి క్రైమ్:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం జరగనున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు.

### ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగ అధ్యక్షుల నియామకం

**తిరుపతి మంగళం :** వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో ఎంపీ.రెడ్డెప్ప(చిత్తూరు), పీ.చంద్రశేఖర్‌రెడ్డి(చంద్రగిరి), డీ.రామచంద్రయ్య(గంగాధరనెల్లూరు), జీ.పెన్నవేలు సింహ(కుప్పం), పీ. కుమారస్వామి(నగిరి), గోవిందరెడ్డి(తిరుపతి) నియోజకవర్గాల నుంచి నియమితులైనట్టు పేర్కొంది.



శ్రీసిటీ పారిశ్రామికవాడ ఏరియల్ వ్యూ

**శ్రీసిటీ ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదాల వివరాలు**

| సంవత్సరం | ప్రమాదాల సంఖ్య |
|---|---|
| 2017 | 11 |
| 2018 | 23 |
| 2019 | 35 |
| 2020 | 11 |
| 2021 | 11 |
| 2022 | 14 |
| 2023 | 19 |
| 2024 | 34 |

# నిప్పు.. ఆర్పేదెట్టో చెప్పు?

అంతర్జాతీయ స్థాయి హంగులు.. ఆర్భాటాలు.. ఉత్పత్తులు.. కార్మికులతో కళకళలాడే శ్రీసిటీ పారిశ్రామిక వాడలో ఏదైనా అనుకోని అగ్నిప్రమాదం జరిగితే ఇక అంతే సంగతులు. 250 పరిశ్రమలు.. 70 వేల మంది కార్మికులు పనిచేస్తున్న ఈ ప్రాంతంలో శాశ్వత అగ్నిమాపక కేంద్రం లేదంటే అతిశయోక్తి కాదేమో. ఇక్కడ ఎనిమిదేళ్లుగా తాత్కాలిక ఫైర్‌స్టేషనే దిక్కుగా మారింది. దీనికితోడు కాలం చెల్లిన వాహనం.. సిబ్బంది లేమితో ఎప్పుడు ఏం జరుగుతుందోనని కార్మికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తోంది.

**శ్రీసిటీ పారిశ్రామిక వాడలో తాత్కాలిక అగ్నిమాపక కేంద్రం**

- ఏడు నెలలుగా కార్యరూపం దాల్చని శాశ్వత అగ్నిమాపక కేంద్రం
- సీఎం చంద్రబాబు శంఖుస్థాపన చేసినా ప్రయోజనం శూన్యం
- బిక్కుబిక్కుమంటున్న కార్మిక లోకం



శ్రీసిటీలోని తాత్కాలిక అగ్నిమాపక కేంద్రంలో కాలం చెల్లిన వాహనం

**వరదయ్యపాళెం:** సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీ పారిశ్రామికవాడ దినదినాభివృద్ధి చెందుతోంది. ఇక్కడ తొలి దశలో 8వేల ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైంది. నేటికి 250కి పైగా పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రమైంది. రూ.50,000 కోట్ల పెట్టుబడులతో 70 వేలకు పైగా వివిధ విభాగాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన శ్రీసిటీ పారిశ్రామికవాడలో ప్రభుత్వం నుంచి నెలకొల్పాల్సిన అగ్నిమాపక సేవలు నామమాత్రంగా మారాయి. ఇక్కడ పరిశ్రమల్లో చిన్నపాటి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నా స్పందించలేని నిస్సహాయ స్థితిలో అగ్నిమాపక వ్యవస్థ ఉంది.

**కాలం చెల్లిన వాహనం.. నామమాత్రపు సిబ్బంది**

శ్రీసిటీలో ఏర్పాటైన తాత్కాలిక అగ్నిమాపక కేంద్రంలో 2010కి చెందిన కాలం చెల్లిన వాహనాన్ని నైవేద్యంగా ఉంచారు. ఈ వాహనం ప్రమాదం జరిగిన సమయంలో కదలని పరిస్థితి. అంతేగాక ఒక డ్రైవర్, మరో లీడింగ్ ఫైర్‌మన్‌తో రోజువారి విధులను కొనసాగిస్తున్నారు. ప్రమాదం జరిగితే కనీసం ఘటనా స్థలానికి ఆరుగురు సిబ్బందితో అగ్నిమాపక వాహనం వెళ్లాల్సి ఉంది. అయితే ఇక్కడ ఉన్న ఇద్దరి సిబ్బందితో ప్రమాదం ఎలా నియంత్రిస్తారో తెలియని పరిస్థితి. శ్రీసిటీలో ఏర్పాటైన 250 పరిశ్రమలు దృష్ట్యా ఇక్కడ అగ్నిమాపక నియంత్రణ చర్యలు సకాలంలో చేపట్టాలంటే కనీసం 13 వేల లీటర్లు నీటి సామర్థ్యం కలిగిన బ్రౌజర్ వాహనం అందుబాటులో ఉండాలి. అయితే ప్రస్తుతం ఉన్న వాహనం 4,500 లీటర్ల సామర్థ్యం కలిగి ఉండడం గమనార్హం.

**ఎనిమిదేళ్లుగా తాత్కాలికమే!**

పరిశ్రమల్లో నెలకొనే అగ్ని ప్రమాదాల నియంత్రణకు అన్ని హంగులతో కూడిన అగ్నిమాపక కేంద్రాన్ని ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేయాలని 2016లో శ్రీసిటీ పర్యటనకు వచ్చిన అప్పటి సీఎం చంద్రబాబుకు యాజమాన్యం విన్నవించింది. ఆ మేరకు 2017 జూలై 28న శ్రీసిటీలో తాత్కాలిక అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి గత ఎనిమిదేళ్లుగా ఈ తాత్కాలిక అగ్నిమాపక కేంద్రమే దిక్కుగా మారింది.

**ఆచరణ ఏదీ?**

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతేడాది ఆగస్టు 19న ఆర్భాటంగా శ్రీ సిటీలో పర్మినెంట్ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నాయుడు భూమి పూజ చేశారు. అయితే ఏడు నెలలు పూర్తికావస్తున్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు. నేటికీ తాత్కాలిక అగ్నిమాపక కేంద్రమే కొనసాగుతోంది. శ్రీసిటీ యాజమాన్యం మాత్రం తమ సొంత నిధులతో అగ్నిమాపక కేంద్రానికి నూతన భవనాన్ని నిర్మిస్తోంది.

**ప్రభుత్వానికి నివేదించాం**

"శ్రీసిటీలో పర్మినెంట్ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదించాం. అయితే ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. శ్రీసిటీలో ఉన్న పరిశ్రమల దృష్ట్యా తప్పనిసరిగా పర్మినెంట్ ఫైర్ స్టేషన్ అవసరం. అందుకు అనుగుణంగానే ప్రభుత్వానికి తెలిపాం.
– రమణయ్య, జిల్లా అగ్నిమాపక అధికారి, తిరుపతి జిల్లా

**• ఉగాది వైభవం**



తిరుమల శ్రీవారి ఆలయంలో ఉగాది శోభ ఉట్టిపడుతోంది. తెలుగు నంవత్సరాదిని పురస్కరించుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సుగంధ సుమాలలు, మిరిమిట్లు గొల్పే విద్యుత్ దీపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. – తిరుమల





అరటి పిలకలు.. మామిడి తోరణాలు.. కట్ ఫ్లవర్లతో శ్రీకాళహస్తీశ్వరాలయం శోభిల్లు తోంది. ఉగాదిని పురస్కరించుకుని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. – శ్రీకాళహస్తి

## నేడు, రేపు రిజిస్ట్రేషన్లకు అవకాశం



శ్రీరామ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్

**తిరుపతి అర్బన్:** ఆస్తుల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లకు ఏప్రిల్ 1 నుంచి స్లాట్ బుకింగ్ సిస్టమ్ ఉంటుందని జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఒక్క రిజిస్ట్రార్ ఉన్న సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రోజుకు 39 స్లాట్స్ ఇస్తామని, ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్ ఉన్నచోట 72 స్లాట్స్ ఇస్తామని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారు ముందుగా స్లాట్స్ బుకింగ్ చేసుకోవాలని ఆయన వివరించారు. మరోవైపు ఆది, సోమరాలు ఉగాది, రంజాన్ పండుగలు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

# ఎస్వీయూ అధికారుల అరాచకం

**నోటీసులు ఇవ్వకుండానే 17 మంది తాత్కాలిక ఉద్యోగుల తొలగింపు**

- నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యం
- అధికారుల తీరుపై కోర్టు తలుపు తట్టనున్న ఉద్యోగులు
- టీడీపీ అనుబంధ సంఘాలు సైతం కన్నెర్ర



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తొలగించిన ఉద్యోగులు

**సాక్షి టాస్క్‌ఫోర్స్ తిరుపతి:** కూటమి ప్రభుత్వం వచ్చాక ఎస్వీయూ పాలన అస్తవ్యస్తంగా తయారైంది. అధికారులు తీసుకుంటున్న ప్రతి నిర్ణయం వివాదాస్పదమవుతోంది. పాలనపై అవగాహన లేకపోవడం, యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కడంతో న్యాయస్థానాలు సైతం వర్సిటీ అధికారులకు సూచనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికార అహం తప్ప వర్సిటీని అభివృద్ధి పథంలో నడపాలన్న యావ ఏకోశానా లేనట్లుగా స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలోనే వర్సిటీలో ఇప్పటికే వంద మందికి పైగా తాత్కాలిక ఉద్యోగులను రోడ్డుపాలు చేసిన అధికారులు శనివారం కో–ఆపరేటీవ్ స్టోర్‌లో పనిచేస్తున్న మరో 17 మంది ఉద్యోగులపై తమ ప్రతాపాన్ని చూపారు. కనీసం నోటీసులు ఇవ్వకుండానే టర్మినేట్ చేసేశారు. దీంతో ఉద్యోగులు వర్సిటీ అధికారుల తీరుపై మండిపతున్నారు. వర్సిటీలో పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. కూటమి ప్రభుత్వ అనుచర ఉద్యోగులు సైతం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కన్నెర్ర**

వర్సిటీ అధికారుల తీరుపై అధికార పార్టీకి చెందిన అనుబంధ సంఘాలు కన్నెర్ర చేస్తున్నాయి. వర్సిటీ పరిపాలనా భవనంలో ఇటీవల జరిగిన అంతర్గత బదిలీలు నిబంధనలకు విరుద్ధంగా చేశారని ఆ పార్టీ స్థానిక నేతలు, అనుచరులు అధికారులను నిలదీశారు. ఉన్నతాధికారుల తీరుపై స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో ప్రజాప్రతినిధులు సైతం ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం.

**వదిలే ప్రసక్తేలేదు**

"వర్సిటీ అధికారులు తమకు నోటీసులు ఇవ్వకుండా స్టోర్‌లో పనిచేస్తున్న 17 మంది ఉద్యోగులను తొలగించడం బాధాకరం. అధికార అహంతో మాపై వేటు వేసి రోడ్డుపాలు చేశారు. అందరం ఏకమవుతాం. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. అలాగే ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం. ఎస్సీ ఉద్యోగులను సైతం అవమానపరిచారు. న్యాయం జరిగే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదు. – వర్సిటీ అధికారుల అరాచకానికి బలైన ఉద్యోగులు, ఎస్వీయూ

# తుడా వార్షిక బడ్జెట్ రూ.611 కోట్లు



మాట్లాడుతున్న కలెక్టర్, తుడా ఉపాధ్యక్షురాలు

**తిరుపతి తుడా:** తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ తొలి బోర్డు సమావేశం తుడా కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు ఎస్.మౌర్య ఇతర అధికారులు హాజరయ్యారు. ఇందులో ప్రధానంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.611 కోట్ల బడ్జెట్‌ను పలు అభివృద్ధి పనులకు కేటాయిస్తూ ఆమోద ముద్రవేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపులను నియమనిబంధనలకు లోబడి వినియోగించాలని సూచించారు. ఓఎస్డీ వెంకటసుబ్బయ్య, ఆర్‌బీ శ్రీనివాసులు, తుడా ఇన్‌చార్జి సెక్రటరీ పాల్గొన్నారు.

**ఆమోదం తెలిపిన ప్రధానాంశాలు**

- 2023–24 ఆర్థిక సంవత్సర ఖాతా నివేదికలను ఆడిట్ చేయడం
- రేణిగుంట, సూరప్పకశంలోని పద్మావతి నగర్ లేఔట్‌లో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణం, విద్యుద్దీకరణ.
- మహిళా వర్సిటీలో రోడ్డు నిర్మాణం.
- ఎస్వీయూలో మాస్టర్ ప్లాన్ రోడ్ల ఆమోద ప్రతిపాదన రద్దుకు సిఫార్సు.
- తుడా టవర్స్ ప్లాట్లు, వాణిజ్య సముదాయాలు, కార్యాలయాల గదుల విక్రయం, లీజుకు ఇచ్చేందుకు అంగీకారం
- నెల్లూరు–తడ, తడ–శ్రీకాళహస్తి, పుత్తూరు నుంచి కడూరు వరకు ఉన్న మూడు రహదారుల డెవలప్‌మెంట్ ప్లాన్
- తుడాలో విలీనమైన ప్రాంతాల మాస్టర్ ప్లాన్ తయారీపై టెండర్ల ఆహ్వానం
- చంద్రగిరి నియోజకవర్గం మామండూరు వద్ద ఎంఐజీ లేఔట్ అభివృద్ధి
- రుయా హాస్పిటల్ వద్ద రోడ్ల అభివృద్ధికి ఆమోదం

### శ్రీవారి దర్శనానికి 10 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 65,569 మంది స్వామివారిని దర్శించుకోగా 21,780 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.15 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది.

## క్లుప్తంగా

### లారీ ఢీకొని వ్యక్తి మృతి

**నాయుడుపేట టౌన్:** పట్టణంలోని గోమతి సెంటర్ వద్ద శుక్రవారం రాత్రి లారీ ఢీకొన్న ప్రమాదంలో తొప్పని అంకయ్య(56) మృతి చెందాడు. పోలీసుల కథనం.. పెళ్లకూరు మండలం, పెన్నేపల్లి గ్రామానికి చెందిన అంకయ్య కొన్నేళ్లుగా నాయుడుపేట పట్టణంలోని ఎల్‌ఏ సాగరంలో భార్య పిల్లలతో కలిసి ఉంటున్నాడు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కూలి పనులకు వెళ్లి శుక్రవారం రాత్రి ఇంటికి తిరిగి వస్తుండంగా మార్గమధ్యంలో గోమతి సెంటర్ సమీపంలో నాయుడుపేట వైపు వస్తున్న లారీ అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంకయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తర్వాత స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. అంకయ్య మృతదేహాన్ని శనివారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### సాహితీ ప్రతిభామూర్తులకు ఉగాది పురస్కారాలు

**తిరుపతి కల్చరల్:** జిల్లాకు చెందిన సాహితీ రంగంలో ప్రతిభ చూపిన వారికి ఉగాది పురస్కారాలు అందజేయడం తిరుపతికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు జిల్లా రచయిత సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీవిశ్వావసు నామ ఉగాది సందర్భంగా తిరుపతి జిల్లాకు చెందిన కిరణ్ క్రాంత్ చౌదరికి కళారత్న పురస్కారం, రాసాని, కంపల్లి రవిచంద్ర, ఆముదాల మురళికి హసం పురస్కాలకు ఎంపికైనట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ పేరూరు బాలసుబ్రమణ్యం హర్షం వ్యక్తం చేశారు.

### డీడీఈ హాల్ టికెట్ల విడుదల

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ దూర విద్యావిభాగం పరీక్షలు వచ్చే నెల 2వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల హాల్ టికెట్లను అధికారులు వర్సిటీ దూరవిద్య అధికారిక వెబ్‌సైట్‌లో శనివారం నుంచి అందుబాటులో ఉంచారు. ఎస్వీయూ నోడల్ సెంటర్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు వెబ్‌సైట్ నందు విద్యార్థుల సొంత లాగిన్ ఐడీతో డౌన్లోడ్ చేసుకోవాలిని, స్టడీ సెంటర్లలో ప్రవేశం పొందిన విద్యార్థులు సంబంధిత స్టడీ సెంటర్ ఐడీతో లాగిన్ ద్వారా హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని దూర విద్య విభాగం డైరెక్టర్ ఆచార్య ఊకా రమేష్ బాబు తెలిపారు. కాగా పరీక్షలకు నాలుగు రోజుల ముందు హాల్‌టికెట్లను విడుదల చేయడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఉద్యోగాలకు సెలవులు మంజూరు చేసుకుని పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం అసాధ్యమని వారు వాపోతున్నారు.

### సిలికా గుంతలో స్నానానికి వెళ్లి..

**చిల్లకూరు :** సిలికా గుంతల్లోని నీటిలో స్నానానికి వెళ్లి ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని చింతవరం కొత్తపాళెం గ్రామానికి చెందిన కొంతమంది వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో సిలికా గుంతలోని నీటిలో స్నానం చేసేందుకు ఉపక్రమించారు. ఈ క్రమంలో అందరూ గుంతలో నుంచి పైకి రాగా గ్రామానికి చెందిన బొనిగి కృష్ణయ్య(60) ఎంతకీ రాలేదు. అతనిని వెదికి పైకి తీసుకొచ్చే సరికే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

## గుడి సంబరం.. మదినిండా భక్తిభావం

ఆధ్యాత్మికత సంస్కృతికి దర్పణం పడుతూ గుడి సంబరాలు జన హృదయాల్లో భక్తి భావాలను రేకెత్తించింది. పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు గుడి సంబరాలు కార్యక్రమాన్ని అద్వితీయంగా చేపట్టారు. ఈ సంబరాలకు రాష్ట్రం నుంచే కాక ఇతర ప్రాంతాలతో పాటు స్థానిక నృత్య కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నృత్య కళాకారులు శ్రీరామలీలలు, అర్ధనారీశ్వర, విఘ్నేశ్వర స్తుతి, హనుమాన్ చాలీసా, వాయుస్తుతి, వందనం రఘునాథ, నారసింహ స్తుతి వంటి ఘట్టాలను తమ నృత్యాలతో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పరంపర ఫౌండేషన్ అధినేత డాక్టర్ శ్రీనాగి మాట్లాడుతూ అంతరించిపోతున్న సంస్కృతిని మరింత విస్తృతం చేసి తద్వారా సమాజంలో ఆధ్యాత్మికత, సంస్కృతిని పెంపొందించేందుకు గుడి సంబరాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో గుడి సంబరాలు చేపట్టడం మహాద్భాగ్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి తిలకించిన బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పరంపర ఫౌండేషన్ ప్రతినిధులు ప్రమోద్ రెడ్డి, శశిరెడ్డి, అధిక సంఖ్యలో పుర ప్రజలు పాల్గొన్నారు.

– తిరుపతి కల్చరల్

## సాక్షి ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం

- నేడు తిరుపతిలో ప్రత్యేక కార్యక్రమం




**తిరుపతి కల్చరల్:** సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఉగాది సంబరాలను అత్యంత వేడుకగా నిర్వహించనున్నారు. 'సాక్షి' అందిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమానికి ఏబీ ఎలక్ట్రానిక్స్ గౌరవ స్పాన్సర్‌గా, కో స్పాన్సర్‌గా అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్, అన్నమాచార్య యూనివర్సిటీ, శుభమస్తు షాపింగ్‌మాల్, కెనరా బ్యాంకు సహకారం అందించనున్నాయి. ఈ ఉగాది వేడుకల్లో కళాత్మకమైన, తెలుగుదనం ఉట్టిపడేలా కూచిపూడి నృత్యం, బాల బాలికలచేత సంప్రదాయ వస్త్రధారణ, తెలుగు పద్యాల పోటీలు, అవధానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రత్యేక పూజల అనంతరం పంచాంగ శ్రవణం చేపట్టనున్నారు. భవిష్యత్ మీకు ఏమి అందిస్తుందనే విషయాలను 'సాక్షి' పంచాంగం శ్రవణం ద్వారా తెలియజేయనున్నారు. ఈ సంప్రదాయ ఉగాది వేడుకల్లో ప్రజలందరూ పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# పింఛన్లకు కత్తెర

- ఇబ్బడిముబ్బడిగా తనిఖీలు, సర్వేలు
- లబోదిబోమంటున్న అభాగ్యులు
- ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి





పింఛన్ల పంపిణీలో డీఆర్‌డీఏ అధికారులు(ఫైల్)

**తిరుపతి అర్బన్:** కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల్లోనే సామాజిక భద్రతా పింఛన్ల సంఖ్య గణనీయంగా తగ్గించేసింది. ప్రతి నెలా పింఛన్ల విషయంలో కత్తెర వేస్తోంది. నెలకు సుమారు వెయ్యి పింఛన్లు తొలగించేస్తోంది. గత ఏడాది జూన్‌లో 2,71,183 పింఛన్లు ఇవ్వగా.. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ఆ సంఖ్య 2,61,841 పడిపోయింది. ఈ పది నెలల కాలంలోనే 9,342 పింఛన్లకు చెక్ పెట్టింది. తాజాగా ఏప్రిల్‌లో మరో 620 పింఛన్లకు కోత విధించింది.

**ఆందోళన..అభద్రతా భావం**

పింఛన్ లబ్ధిదారుల విషయంలో కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది. సర్వేలు.. తనిఖీల పేరుతో వేధింపులకు గురిచేస్తోంది. ఇప్పటికే రూ.15 వేల పింఛన్ల తనిఖీని పూర్తిచేసింది. తొలగించిన జాబితాను విజయవాడ ప్రధాన కార్యాలయంలో ఇచ్చినట్లు తెలిసింది. ఆ జాబితాను ఏప్రిల్‌లో ప్రకటిస్తారని సమాచారం. మరోవైపు రూ.6 వేల పింఛన్లు తీసుకుంటున్న వారిని రెండు నెలలుగా తనిఖీలు చేస్తున్నారు. ఏప్రిల్ 30 నాటికి వారి తనిఖీ పూర్తి చేయనున్నారు. వీరిలో అనర్హుల జాబితాను మేలో ప్రకటించనున్నారు. ఆ తర్వాత రూ.4 వేల పింఛన్ల లబ్ధిదారులను తనిఖీ చేయనున్నారు. ఇలా.. వరుస తనిఖీలతో ఎప్పుడు .. ఎవరి పింఛన్ తొలుగుతుందోనన్న భయాందోళన లబ్ధిదారుల్లో నెలకొంది.

**తగ్గిపోతున్న పింఛన్ల వివరాలు**

| నెల | పింఛన్ల సంఖ్య |
|---|---|
| జూన్ | 2,71,183 |
| జూలై | 2,69,162 |
| ఆగస్ట్ | 2,67,772 |
| సెప్టెంబర్ | 2,67,089 |
| అక్టోబర్ | 2,66,342 |
| నవంబర్ | 2,65,488 |
| డిసెంబర్ | 2,64,636 |
| జనవరి | 2,63,995 |
| ఫిబ్రవరి | 2,63,191 |
| మార్చి | 2,62,461 |
| ఏప్రిల్ | 2,61,841 |

### ఊసే లేని వితంతు కొత్త పింఛన్లు



వితంతువు పింఛన్ కోసం కలెక్టరేట్‌కు చేరిన మహిళలు

వితంతు కొత్త పింఛన్ల ఊసే లేకుండా పోతోంది. గత ఏడాది నవంబర్ 1కి ముందు భర్త చనిపోయి ఉంటే వారు వితంతువు పింఛన్‌కి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కాదని ప్రకటించింది. గత ఏడాది డిసెంబర్ 1 తర్వత భర్త చనిపోయి వితంతువులు అయిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించింది. దీంతో అనేక మంది భర్త చనిపోయిన బాధను కడుపులో దిగమింగుకుని పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

### ఎవరి పింఛన్ తొలగించలేదు



ఎవరి పింఛన్ తొలగించలేదు. కొందరు మృతి చెందిన వారు అందులో ఉన్నారు. మరికొందరు వరుసగా మూడు నెలలుగా ఫించన్లు తీసుకోకుంటే వారివి తగ్గిస్తారు. రూ.15 వేలు పింఛన్ లబ్ధిదారుల తనిఖీ పూర్తయింది. రూ.6 వేల పింఛన్ల లబ్ధిదారుల తనిఖీ కొనసాగుతోంది. వాటిలో తొలగించిన జాబితా మాకు ఇప్పటి వరకు రాలేదు.

–టీఎన్ శోభనబాబు, డీఆర్‌డీఏ పీడీ

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

– ముగ్గురికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో పోలీసులు

**శ్రీకాళహస్తి:** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన తొట్టంబేడు మండలం, బసవయ్యపాళెం వద్ద శనివారం చోటుచేసుకుంది. 2వ పట్టణ పోలీసుల కథనం .. హైదరాబాద్‌కు చెందిన కావడి శ్రీనివాసులు, మల్లారెడ్డి, భరత్‌కుమార్, బాల్‌రెడ్డి తిరుమల శ్రీవారి దర్శనానికి కారులో బయలుదేరారు. మార్గ మధ్యంలో తొట్టంబేడు మండలం, బసవయ్యపాళెం వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై డివైడర్‌ను కారు ఢీకొంది. ఈ ఘటనలో కావడి శ్రీనివాసులురెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని ఓ ఆస్పత్రికి తలరించారు. శ్రీనివాసులురెడ్డి మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయండి

**తిరుపతి సిటీ:** విద్యార్థినులు ప్రగాఢ ఆత్మవిశ్వాసంతో సాధికారిత వైపు అడుగులు వేయాలని ఎస్వీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ పిలుపునిచ్చారు. శనివారం పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పూర్వ విద్యార్థినుల వార్షిక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం పూర్వ విద్యార్థినుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ వసుధ ఈ సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాల గురించి, చేపట్టబోయే వాటి గురించి తెలియజేస్తూ, వార్షిక నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ డీఎం ప్రేమావతి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఆచార్య కుసుమ కుమారి, డాక్టర్ వనజాక్షి, పూర్వ విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఎందుకు రమ్మన్నారు.. వెళ్లమన్నారు?

- వైఎస్సార్‌సీపీ మహిళా ఎంపీటీసీకి అవమానం
- మండల సమావేశం నుంచి వెళ్లాలంటూ ఎంపీడీఓ హుకుం
- నిధుల దుర్వినియోగంపై ఆర్టీఐ పెట్టినందుకు కక్ష
- ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను బయటకు పంపిన పోలీసులు
- మహిళా ఎంపీటీసీ, నాయకులపై ఎంపీపీ ఆగ్రహం



నోటీసులు చూపించి వివరాలను వెల్లడిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి

**వెంకటగిరి రూరల్ :** మండలంలోని పాళెంకోట ఎంపీటీసీ సభ్యురాలు పుల్లూరు శ్రీదేవికి ఘోర అవమానం చోటు చేసుకుంది. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం ప్రారంభమైంది. సమావేశం జరుగుతుండగా ఎంపీడీవో కోటేశ్వరరావు కలుగజేసుకున్నారు. సమావేశం నుంచి వెళ్లిపోవాలని పాళెంకోట ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవిని ఆదేశించారు. దీంతో ఆమె సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అనారోగ్య కారణాల రీత్యా గత మూడు సమావేశాలకు హాజరు కాలేకపోయానన్నారు. ఈ మేరకు ఎంపీడీఓకు శుక్రవారం నోటీలు జారీచేసినట్టు వెల్లడించారు. దీంతో శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని జరిగిన విషయాన్ని వ్రాతపూర్వకంగా ఎంపీడీఓకు విన్నవించానని చెప్పారు. అనంతరం సమావేశానికి వెళ్లమని చెప్పి.. ఆపై అవమానించారని చెప్పారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు సదారెడ్డి, మాజీ సర్పంచ్ తిరుమల, పాళెంకోట సర్పంచ్ వేణురెడ్డి ఎంపీడీఓను నిలదీశారు. ఎస్‌ఐ సుబ్బారావు కలుగజేసుకుని మాజీ సర్పంచ్ తిరుమల, సదారెడ్డిని సమావేశ మందిరం నుంచి బయటకు పంపించేశారు.

**కక్ష సాధింపు చర్యల్లో భాగమేనా?**

వెంకటగిరి రూరల్ మండలంలోని పారవోలు పంచాయతీలో రూ.2 లక్షలకు పైగా అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయంటూ, ఇందుకు సంబంధించిన వివరాలు తెలియజేయాలని పారవోలు ఎంపీటీసీ శ్రీదేవి భర్త సదానందరెడ్డి గత శుక్రవారం ఆర్టీఐ పెట్టారు. దీంతో కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఓ ప్రజాప్రతినిధిని సభామందిరంలో అవమానించారని చర్చ సాగుతోంది.

# శ్రీ విశ్వావసు నామ సంవత్సర రాశిఫలాలు - Advt Feature

## మేష రాశి
అశ్విని, భరణి, కృత్తిక మొదటిపాదం

**ఆదాయం -2, వ్యయం -14, రాజపూజ్యం -5, అవమానం -7**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (తృతీయ) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (లాభం) కేతువు సింహరాశి (పంచమం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (వ్యయం)లో సంచారం ఏలి నాటి శని ప్రారంభం అయినది. ప్రతి విషయమునకు శని పేరు చెప్పి భయపడకండి. కేవలం ఈ సంవత్సరం పనులు ఆలస్యం అవ్వటమే కానీ పనులు పాడవ్వడం అనేది లేదు. దూకుడుగా నిర్ణయాలు చేయకండి. మిత భాషణ మరియు ఇతరుల వ్యవహారములలో తలదూర్చకుండా ఉండడం చాలా అవసరం. ఇతరుల సహకారం తక్కువగా ఉంటుంది. రోజువారీ కార్యముల విషయమై మంచిగా వ్యవహరించి సత్ఫలితాలు అందుకుంటారు. అనవసర కాలక్షేపం కూడా చేస్తారు. కుటుంబ విషయాలు పరిశీలింపగా బంధువర్గంతో బహు జాగ్రత్తలు తీసుకోండి. పెద్దల ఆరోగ్య విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. పిల్లల అభివృద్ధి విషయంగా కూడా ఫలితాలు సానుకూలంగా ఉంటాయి. ఉద్యోగ విషయములు పరిశీలింపగా అధికారుల నుండి ఒత్తిడి ఎక్కువ ఉంటుంది. స్థానచలన ప్రయత్నాలు ప్రత్యేకం చేయాలి. ప్రమోషన్ ప్రయత్నాలు ప్రత్యేకం చేయకపోతే ప్రతికూల ప్రదేశాలకు చేరతారు. నూతన ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవారికి పనులు వేగంగా సాగవు.

## వృషభం
కృత్తిక 2,3,4, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

**ఆదాయం -11, వ్యయం -5, రాజపూజ్యం -1, అవమానం -3**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (ద్వితీయం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (దశమం) కేతువు సింహరాశి (చతుర్థం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (లాభం)లో సంచారం. శని సంచారం గురు సంచారం అనుకూలంగా ఉన్న కారణంగా చాలా మంచి ఫలితాలు అందుకుంటారు. సాంఘీకంగా గౌరవ మర్యాదలు పెరుగుతుంటాయి. సమయపాలనతో చాలా విజయాలు సాధిస్తారు. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతుంటాయి. ధర్మకార్యములు తరచుగా చేస్తూ ఉంటారు. ఆహార విహార విషయాలలో మీకు సంతుష్టి కలుగుతుంది. రోజువారీ కార్యముల విషయమై ఎటువంటి సమస్యలు లేని జీవితం సాగుతుంది. కుటుంబ విషయాలు పరిశీలింపగా అన్ని విధములుగా మంచి ఫలితాలు అందుకుంటారు. పిల్లల అభివృద్ధి వారి నిమిత్తంగా చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ ఆచార సంబంధమైన కార్యక్రమములు చేస్తుంటారు. ఉద్యోగ విషయములు పరిశీలింపగా ప్రమోషన్‌లు వచ్చే అవకాశం ఉంటుంది. మీకు అందరి నుండి సహాయ సహకారములు బాగా అంది మంచి విజయములు సాధించే అవకాశం ఉన్నది. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో వున్నవారికి పనులు చాలా అనుకూలంగా ఉంటాయి.

## మిథునం
మృగశిర 3,4, ఆరుద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

**ఆదాయం -14, వ్యయం -2, రాజపూజ్యం -4, అవమానం -3**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (జన్మం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (నవమం) కేతువు సింహరాశి (తృతీయం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (దశమం)లో సంచారం. తరచుగా బుద్ధి భ్రంశనమునకు లోనవుతుంటారు. దూరప్రాంతములకు వెళ్ళాలి. చేయు పనులు విడిచి ప్రశాంతంగా దూరంగా వెళ్ళాలనే కోరిక పెరుగుతుంటుంది. చేసే ప్రతిపనీ పరధ్యానంగా చేస్తారు. మీ ప్రయత్నాలు ఏవీ సరిగా సాగవు. అందరూ 'నన్ను సరిగా గౌరవించడం లేదు' అనే భావన పెరుగుతుంది. చతుష్పాద జంతువులతో ఇబ్బంది ఉంటుంది. రోజువారీ కార్యముల విషయమై సమయ పాలనతో కూడి పనులు పూర్తి అవుతుంటాయి. కుటుంబ విషయాలు పరిశీలింపగా మే వరకు కొన్ని సమస్యలతోనూ మే నుండి కొంత అనుకూల వాతావరణము ఉంటుంది. మీ కుటుంబ వ్యవహారములలో ఇతరుల ప్రమేయం నిర్ద్వంద్వంగా ఖండిస్తే సుఖపడతారు. ఉద్యోగ విషయములు పరిశీలింపగా మీకు సహకరించే అధికారులు విరుద్ధంగా ఉంటారు. ప్రతిపనీ మీ అవగాహన లోపం వలన ఒకటికి రెండుసార్లు చేయవలసి వచ్చి ఇబ్బంది పడుతుంటారు. వ్యాపారస్తులకు అనుకూల స్థితి తక్కువ. ఆలోచనలకు, అమలుకు సంబంధం లేక సాధారణ ఫలితాలు అందుకుంటారు.

## కర్కాటకం
పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

**ఆదాయం -8, వ్యయం -2, రాజపూజ్యం -7, అవమానం -3**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (నవమం) ప్రవేశం, రాహువు మే 19వ తేదీన కుంభరాశి (అష్టమం) కేతువు సింహరాశి (ద్వితీయం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (భాగ్యం)లో సంచారం. ఒకసారి విశేష అనుకూల వాతావరణం, ఒక్కోసారి ప్రతికూల వాతావరణం ఈ విధంగా చికాకుపడతారు. మే నెల దగ్గర నుండి మానసిక, శారీరక శ్రమ ఎక్కువ. మీరు మీ వస్తువులు ఏదో ఒక రూపంలో నష్టపడుతూ ఉంటారు. జాగ్రత్త పడాలి అనే విషయాలలో అనవసర ప్రయత్నాలు చేస్తారు. తరచుగా పుణ్యక్షేత్ర సందర్శన నిమిత్తం ప్రయాణం చేస్తారు. రోజువారీ కార్యముల విషయమై అన్ని సమయపాలన లేక ఇతర పనులు కూడా చికాకు పెడుతుంటాయి. కుటుంబ విషయాలు పరిశీలింపగా పిల్లలకు మీకు సరిగా మానసిక స్థితి సమన్వయం అవ్వక బాధపడతారు. పెద్దల ఆరోగ్య విషయం కూడా ప్రతికూలంగా ఉంటుంది. బంధువుల ప్రమేయం కుటుంబ విషయాలలో ఎక్కువ. ఉద్యోగ విషయములు పరిశీలింపగా అధికారుల ఆగ్రహావేశాలు మే తరువాత ఎక్కువ. మే వరకు చాలా తెలివిగా ప్రవర్తిసారు. స్థానచలనం మరియు ప్రమోషన్ విషయాలు ఆశించిన రీతిగా ఉండవు జాగ్రత్తపడండి. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్న వారికి మోసపోయే లక్షణాలు ఉన్నాయి.




## సింహం
మఖ, పుబ్బ, ఉత్తర మొదటి పాదం

**ఆదాయం -11, వ్యయం -11, రాజపూజ్యం -3, అవమానం -6**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (లాభం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (సప్తమం) కేతువు సింహరాశి (జన్మం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (అష్టమం)లో సంచారం. ప్రతి విషయంలో మనస్పర్థలు రావడం వాటిని సరిచేసుకోవడంతో కాలక్షేపం అవుతుంది. గురుబలం ఈ సంవత్సరం అంతా శ్రీరామ రక్ష. పార్టనర్‌షిప్ వ్యవహారములలో జాగ్రత్త అవసరం. అన్ని రకాలైన వ్యవహారములలోనూ గురు అనుకూలం దృష్ట్యా మంచి ప్రణాళికలు చేసినా మీ చుట్టూ ఉన్న సన్నిహితులను నమ్మి సమస్యలకు దగ్గర అవుతుంటారు. రోజువారీ కార్యముల విషయమై మీకు భోజన, స్నాన, నిద్ర వంటి వాటికి కూడా సమయపాలన ఉండదు. కుటుంబ విషయాలు పరిశీలింపగా ప్రత్యేకంగా చెప్పే విషయం ఏమిటంటే 'మితభాషణ' అవసరం. దాని వలన సుఖపడతారు. శని, రాహు సంచారం బాగా లేదు. ఇతరుల ప్రమేయం ఆపివేయండి. ఉద్యోగ విషయములు పరిశీలింపగా అధికారుల అండదండలు బాగా ఉంటాయి. మీరు మీ క్రింద పనిచేయువారి ద్వారా ఇబ్బందులకు దగ్గరవుతారు. మోసపోవు లక్షణాలు గోచరిస్తున్నాయి. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్న వారికి అయోమయ స్థితి ఉంటుంది. తెలివిగా ఉన్నా మోసపోతుంటారు.

## కన్య
ఉత్తర 2,3,4, హస్త, చిత్త 1,2 పాదాలు

**ఆదాయం -14, వ్యయం -2, రాజపూజ్యం -6, అవమానం -6**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (దశమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (షష్ఠం) కేతువు సింహరాశి (వ్యయం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (సప్తమం)లో సంచారం మే నెల వరకు పుణ్యకార్యములు, ధర్మకార్యములు విజ్ఞాన వినోద కార్యములు చేస్తుంటారు. ధర్మకార్యాచరణ ద్వారా సంఘంలో గౌరవ మర్యాదలు పెంచుకుంటారు. ప్రతి పనిలోనూ మే నెల నుండి ధైర్యం పెరుగుతుంది. అయితే ప్రతిపనీ ఆలస్యం అవుతుంది. తరచుగా కుటుంబమునకు ఎక్కువ సమయం దూరం గడపవలసి ఉంటుంది. కొన్నిసార్లు భయం పొందుతారు. రోజువారీ కార్యముల విషయమై మే నుండి సమయపాలన లేకుండా ప్రవర్తిస్తారు, చికాకుపడతారు. కుటుంబ విషయములు పరిశీలింపగా బంధువుల రాకపోకలు అధికం అవుతాయి. మీకు, మీ కుటుంబ సభ్యులకు ఉన్న ఆలోచనలు సరిగా అమలు చేయలేరు. అయితే ఆనందంగా కాలక్షేపం చేయగలుగుతారు. మే నెల నుండి మీ కింద పనిచేయు వర్కర్స్‌తో ఇబ్బంది ఉంటుంది. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్న వారికి తేలికపాటి ప్రయత్నాలతో కొన్నిసార్లు శుభవార్త అందుకుంటారు. వ్యాపారస్తులకు అన్ని పనులు సానుకూలంగా సాగుతాయి. లాభాలు తక్కువ అయినా ప్రశాంతంగా ఉంటారు.

## తుల
చిత్త 3,4, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

**ఆదాయం -11, వ్యయం -5, రాజపూజ్యం -2, అవమానం -2**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (భాగ్యం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (పంచమ) కేతువు సింహరాశి (లాభం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (షష్ఠ)లో సంచారం. చాలా సమస్యలకు పరిష్కారం పొందగలిగే కాలం ప్రారంభం అయినది. క్రమంగా మే నెల నుండి శుభ పరిణామములు ఎక్కువగా ఉంటాయి. పుణ్యకార్యములు, శుభకార్యములు, సాంఘీక కార్యములు చేయు అవకాశం ఎక్కువగా ఉంటుంది. గత సమస్యలు కూడా తీరు అవకాశం ఈ సంవత్సరం మే నెల నుండి అవకాశం ఎక్కువ అవుతుంది. ఆనందంగా ఉంటారు. రోజువారీ కార్యముల విషయమై సానుకూలం ఉంటుంది. సమయపాలన చేయు అవకాశములు ఎక్కువ. కుటుంబ విషయాలు పరిశీలింపగా అంతా శుభ పరిణామములు ఎక్కువ. భార్యాపిల్లల ద్వారా వారి నుండి మీకు మీ నుండి వారికి జరగవలసిన అంశాలు అంతా కూడా చక్కగా పూర్తిచేయు అవకాశములు ఉంటాయి. ఉద్యోగ విషయములు పరిశీలింపగా ఇబ్బందులు లేని జీవితం సాగుతుంది. రాబోవు కాలంలో క్రమంగా అభివృద్ధి వైపు ప్రయాణం సాగుతుంది. అనూహ్యంగా అందరూ సహకారం బాగా చేస్తారు. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నవారికి మంచి సలహాలు అంది చక్కటి లాభాలు అందుకుంటారు.

## వృశ్చికం
విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

**ఆదాయం -2, వ్యయం -14, రాజపూజ్యం -5, అవమానం -2**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (అష్టమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (అర్ధాష్టమ) కేతువు సింహరాశి (దశమం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (పంచమం)లో సంచారం. సాధారణ స్థాయికి విరుద్ధంగా మీకు గ్రహచారం ఉన్నది. అందువలన ప్రత్యేక నియమాలలో జీవనం సాగించాలి. ఏ పనిలోను స్థిరబుద్ధి ప్రదర్శించలేరు. అందరికీ మీ వ్యవహారముల మీద తక్కువ స్థాయి ఆలోచనలు ఉంటాయి. మీరు తరచుగా చోరులు, అన్ని ప్రభుత్వ అధికారులు వంటి వారిలో ఎవరితోనయినా చికాకు పడుతూనే ఉంటారు. తరచుగా క్రూరవాక్యములు పలుకుతూ ఉంటారు. రోజువారీ కార్యముల విషయమై మీరు సరియగు స్థిరబుద్ధి ప్రదర్శింపక పనులు ఆలస్యం చేసి ఇబ్బంది పడతారు. కుటుంబ విషయాలు పరిశీలింపగా మీ నుండి కుటుంబీకులకు అందవలసిన సర్వీసెస్‌లు అన్నీ ఆలస్యంగా అందుతాయి. ఉద్యోగ విషయములు పరిశీలింపగా మీరు సరియగు దృష్టి ప్రదర్శింపక పనులు పాడుచేసుకుంటారు. మీ సన్నిహితులు తప్పనిసరిగా మీకు అత్యవసర సమయాలలో సహకరించరు. ప్రమోషన్, స్థానచలనములు అనుకూలంగా లేవు. వ్యాపారస్తులకు అనుకూల లాభాలు లేకపోయినా ఇబ్బందులు ఉండవు. వ్యాపార సమయంలో ఒత్తిడి ఎక్కువ.




## ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ మొదటి పాదం

**ఆదాయం -5, వ్యయం -5, రాజపూజ్యం -1, అవమానం -5**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (సప్తమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (తృతీయం) కేతువు సింహరాశి (భాగ్యం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (అర్ధాష్టమం)లో సంచారం. ఈ రాశి వారికి ఈ సంవత్సరం చక్కగా చేసిన పనులకు గుర్తింపు సరిగా అందదు. అయితే గొప్పగా ఓర్పు సహనం ప్రదర్శించి సాధారణ స్థాయి జీవనమునకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తపడతారు. అందరితోనూ కలహములు రాకుండా స్నేహ భావం ప్రదర్శిస్తారు. శరీరం గాంభీర్యం కోల్పోయినట్లుగా గోచరిస్తుంది. స్నేహితులతో మితంగా సంభాషణ, సంచారం చేయండి. రోజువారీ కార్యముల విషయమై ప్రధానంగా ప్రత్యేక దృష్టి ఉంచండి. వీటి తరువాతనే ఇతర కార్యములు. కుటుంబ విషయములు పరిశీలింపగా శుభపరిణామములకు అవకాశములు ఎక్కువ. మీ అవసరాలు గుర్తించి సహకరించే కుటుంబ సభ్యులు ఉన్న కారణంగా మంచి ఫలితాలు ఉంటాయి. సోదరద్వేషం తప్పదు. ఉద్యోగ విషయములు పరిశీలింపగా ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలు జాగ్రత్తగా చేసుకుంటే మీకు కావలసిన స్థలం చేరే అవకాశం ఉంటుంది. ఎవరూ సహకరించరేమో అనే రీతిగా మీ చుట్టూ పరిస్థితులు ఉంటాయి. కానీ విజయం తథ్యం. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నవారికి అనుకూలం.

## మకరం
ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1,2 పాదాలు

**ఆదాయం -8, వ్యయం -14, రాజపూజ్యం -4, అవమానం -5**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (షష్ఠం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (ద్వితీయం) కేతువు సింహరాశి (అష్టమం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (తృతీయం)లో సంచారం. కేవలం శని రాహు సంచారం అనుకూలం చేత చాలా విజయాలు సాధిస్తారు. అయితే జూన్ వరకు కుజ సంచారం ప్రభావంగా ప్రయాణ విషయాలలో చికాకులు ఉంటూ ఉంటాయి. స్వబుద్ధి, స్వశక్తితో మీరు చాలా విజయాలు సాధిస్తారు. దీర్ఘమైన పనులు కొంచెం శ్రమతో కూడిన పనులు జూన్‌లోపుగా పూర్తి చేసుకుని ప్రయత్నం చేయడం మంచిది. రోజువారీ కార్యముల విషయమై ఎటువంటి ఇబ్బందులు లేకుండా కాలక్షేపం జరుగుతుంది. అయితే కుటుంబ విషయాలు పరిశీలింపగా మీరు కొంచెం ఓర్పుగా కుటుంబ వ్యవహారముల చూసుకోవాలి అంతా చక్కగా ఉంటుంది. కానీ చికాకులు ఎప్పుడు ఎలా మొదలవుతాయో చెప్పలేని స్థితి ఉంటుంది. ఉద్యోగ విషయములు పరిశీలింపగా శని సంచార అనుకూల ప్రభావం సర్వత్రా విజయమే. మంచి గుర్తింపు వస్తుంది. ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలు, ప్రమోషన్ ప్రయత్నాలు కూడా చాలా విశేషంగా అనుకూల ఫలితాలు ఇస్తాయి. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నవారికి పనులు జూన్ వరకు విశేషం.

## కుంభం
ధనిష్ఠ 3,4, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

**ఆదాయం -8, వ్యయం -14, రాజపూజ్యం -4, అవమానం -5**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (పంచమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (జన్మం) కేతువు సింహరాశి (సప్తమం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (ద్వితీయం)లో సంచారం. ఏలినాటి శని తృతీయ భాగంలో నడుస్తుంది. అయితే పెద్దగా రాహువు యోగించకపోయినా గురుబలం అనుకూలం వలన చాలా మంచి ఫలితాలు అందుకుంటారు. ప్రతి విషయంలోనూ కొన్నిసార్లు తెలివిగాను, కొసార్లు అసహనంతో ప్రవర్తిస్తుంటారు. అన్ని విషయాలలో మీ గౌరవ మర్యాదలకు భంగం కలుగకుండా ఉండేలాగ మీ ప్రవర్తనను చూసుకుంటూ గడపండి. రోజువారీ కార్యముల విషయమై మీరు స్థిరచిత్తంతో ప్రవర్తింపక కొత్త కొత్త సమస్యలు అందుకుంటారు. కుటుంబ విషయాలు పరిశీలింపగా అనవసర కలహాలకు కుటుంబ సభ్యులకు అవకాశం ఇచ్చేలాగ ప్రవర్తిస్తుంటారు. అయితే గురుబలం అనుకూలం వలన పెద్ద స్థాయి ఇబ్బందులు కుటుంబ విషయంగా ఈ రాశివారికి ఉండవు. ఉద్యోగ విషయములు పరిశీలింపగా మీరు ఓర్పుగా కొన్నిసార్లు ప్రవర్తించి మంచి ఫలితాలు అందుకుంటారు. కొన్నిసార్లు చికాకుగా వ్యవహరించి ఇబ్బందులు పొందుతారు. వ్యాపారస్తులకు అంతా శుభ ఫలితాలే ఉంటాయి.

## మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

**ఆదాయం -5, వ్యయం -5, రాజపూజ్యం -3, అవమానం -1**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (అర్ధాష్టమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (వ్యయం) కేతువు సింహరాశి (షష్ఠం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (జన్మం)లో సంచారం. ఏలినాటి శని జన్మంలో రెండవ భాగం ప్రారంభం. జన్మ శని వ్యయ రాహు తగు జాగ్రత్తలతో కాలక్షేపం చేయాలి. మీ ప్రమేయం లేకుండా సమస్యలు తలెత్తే సమయం. అందరినీ అనుమానిస్తారు. మీరు అందరి చేత అనుమానింపబడతారు. వీలైనంత వరకు ఇతర పనులు ఆపివేయండి. ప్రతి పనిలోనూ మందగమనం ఉంటుంది. రోజువారీ కార్యముల విషయమై బహు శ్రద్ధ, జాగ్రత్త వహించండి. అది మిగిలిన దినచర్యను రక్షిస్తుంది. కుటుంబ విషయాలు పరిశీలింపగా మీకు ఇబ్బంది లేని జీవనశైలి ఉంటుంది. అయితే మీరు చూపించే అలసత్వం మరియు వాయిదా పద్ధతులు మీకు అవసర కలహములు, మానసిక ఒత్తిడి సృష్టిస్తాయి. ఋణ విషయములో అవమానం సృష్టించకుండా జాగ్రత్తపడండి. కాలం అనుకూలం లేదు. ఋణం ప్రమాదకరము. ఆరోగ్య విషయంలో నేత్ర బాధలు ఉన్నవారు కొంచెం ఇబ్బంది ఎక్కువ పొందుతారు. కోర్టు వ్యవహారములలో ఉన్నవారికి అందరూ బాగా సహకారం చేస్తారు అనే వారు కూడా మోసం చేస్తారు.

